నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 26 అక్టోబర్ 2024 | HYDERABAD

రోడ్డెక్కిన పోలీస్ కుటుంబాలు

కొండాపూర్/జూబ్లీహిల్స్ : టీజీఎస్పీలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లకు సెలవులు ఇవ్వకుండా, విధులకు బదులుగా వెట్టి చాకిరి చేయిస్తున్నారంటూ కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతుగా శుక్రవారం కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్ పోలీసు సిబ్బంది కుటుంబసభ్యులు తమ పిల్లలతో కలిసి కొండాపూర్ ప్రధాన రహదారిలో ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో ఒకే పోలీసు విధానాన్ని కొనసాగించాలని నినదించారు. కొండాపూర్ చౌరస్తాలో మహిళలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టడంతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి, కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కాగా, గచ్చిబౌలి పోలీసులు కొండాపూర్ ప్రధాన రహదారిలో బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళల ఫొటోలు తీసుకుని, 'మీ సంగతి చూస్తామం'టూ భయభ్రాంతులకు గురి చేశారు. ఈ పరిణామంతో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు బెటాలియన్ ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. అక్కడికి చేరుకున్న బెటాలియన్ కమాండెంట్ సన్నీ ఆందోళన విరమించాలని వారిని సముదాయించే ప్రయత్నం చేయగా, పోలీసులు క్షమాపణ చెబితేనే ఇక్కడి నుంచి వెళతామంటూ తెగేసి చెప్పారు. అలాగే యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్, సచివాలయం వద్ద కూడా పోలీసు కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు.

నిరసన గళం ▶ ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలంటూ.. శుక్రవారం సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న పోలీసు కుటుంబసభ్యులు

'సీసీ'తో ట్రాఫిక్ పర్యవేక్షణ

ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు సైబరాబాద్ పోలీసులు సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జాయింట్ కమిషనర్(ట్రాఫిక్) జోయల్ డేవిస్ తెలిపారు. కీలకమైన ట్రాఫిక్ జంక్షన్లు, అనధికార పార్కింగ్ హాట్‌స్పాట్లు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. -సిటీబ్యూరో

డెడ్ డ్రాప్‌లో డ్రగ్ సప్లై

పట్టుబడిన అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

సిటీబ్యూరో: డ్రగ్ సప్లయర్స్ వినియోగదారుల మధ్య లింక్‌లు బయటపడకుండా డెడ్ డ్రాప్ పద్ధతిలో డ్రగ్స్ సప్లై చేస్తున్న రెండు వేర్వేరు ముఠాలను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, స్థానిక పోలీసులతో కలిసి అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నైజీరియాకు చెందిన యాకూబ్ అలియాస్ కుర్బా కొన్నేండ్ల కిందట స్టడీ వీసాపై హైదరాబాద్‌కు వచ్చాడు. సైనిక్‌పురి, టోలీచౌకి ప్రాంతాల్లో ఉంటూ.. మాదకద్రవ్యాలను సరఫరా చేస్తూ పోలీసులకు మూడు సార్లు చిక్కడంతో కుషాయిగూడ, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఇక్కడి పోలీసుల నుంచి తప్పించుకోవడం కోసం తన షెల్టర్‌ను బెంగళూర్‌కు మార్చాడు. అదే విధంగా 2016లో సూడాన్ నుంచి వచ్చిన అబ్దుల్ రహమాన్ ఉస్మాన్ ఇంగ్లిష్ కోర్సు చేసి తిరిగి స్వదేశానికి వెళ్లి, 2018లో మరోసారి స్టడీ వీసాపై వచ్చాడు. యూపీలో బీసీఏ కోర్సులో చేరాడు. 2020లో కరోనా రావడంతో తిరిగి తన దేశానికి వెళ్లిపోయి.. రెండేండ్ల తరువాత తిరిగివచ్చాడు. కోర్సు పూర్తి చేసి.. టోలీచౌక్‌లో నివాసముంటున్నాడు. తన విలాసవంతమైన జీవితానికి డబ్బుల కోసం వివిధ మార్గాలు వెతికి డ్రగ్స్ దందా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆన్‌లైన్‌లో తమ దేశానికి చెందిన వారి గురించి వెతకడంతో బెంగళూర్‌లో ఉన్న యాకూబ్‌తో పాటు నైజీరియా, టాంజానియా నుంచి వచ్చి అక్కడ ఉంటున్న రోమియో, గడాఫీ, జాన్‌పాల్, కేరళ వాసి జాకబ్‌లతో పరిచయం ఏర్పడింది. తమ వద్ద ఉన్న డ్రగ్స్‌ను వీళ్లంతా కలిసి హైదరాబాద్‌లో వినియోగదారులకు అమ్మేందుకు సోషల్ మీడియా యాప్స్ ద్వారా సంప్రదింపులు జరిపేవారు. కస్టమర్ దొరకగానే హైదరాబాద్‌లో ఉన్న రహమాన్ బెంగళూర్‌కు వెళ్లి నగరానికి సరుకు చేరవేసేవాడు. బెంగళూర్‌లో ఉన్న వారు సరుకు రహమాన్‌తో పంపిస్తే... హైదరాబాద్‌లో ఆ డ్రగ్స్ ప్యాకెట్లను రహమాన్ ఒక బహిరంగ ప్రదేశంలో ఎవరికీ అనుమానం రాకుండా దాచేవాడు. ఎండ, వానలోనూ ఎలాంటి ఇబ్బంది లేకుండా దానిని ఒక చోట పెట్టి, ఫొటో, లొకేషన్‌ను బెంగళూర్‌లో ఉన్న వాళ్లకు పంపించేవాడు. అక్కడ ఉన్న వారికి హైదరాబాద్ నుంచి కస్టమర్ డబ్బులు ఆన్‌లైన్‌లో డమ్మీ ఖాతాల్లోకి పంపగానే బెంగళూర్ నుంచి డ్రగ్స్ దాచిపెట్టిన ప్రాంతానికి సంబంధించిన ఫొటో, లొకేషన్‌ను పంపించి.. దానిని కస్టమర్‌కు చేరవేసేవారు. ఇలా డెడ్ డ్రాప్ విధానంలో సప్లయర్స్, రీసివర్స్‌కు లింక్‌లు లేకుండా జాగ్రత్తపడుతున్నారు. వచ్చిన ఆదాయంలో బెంగళూర్‌లో ఉండే పెడ్లర్స్, 30 నుంచి 40 శాతం డెలివరీ చేసిన వ్యక్తులకు అప్పగించేవారు.

కారు డ్రైవర్‌గా చేస్తూ డ్రగ్స్ దందా..

బంజారాహిల్స్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ వృత్తిరీత్యా కారు డ్రైవర్‌గా చేస్తూ డ్రగ్స్ దందా చేస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నాంపల్లి పోలీసులు అరెస్ట్ చేయడంతో జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తరువాత టోలీచౌకిలో కుటుంబానికి దూరంగా నివాసిస్తున్నాడు. బెంగళూర్‌కు చెందిన చుక్వా ఒబైయ్ డెడ్ డ్రాప్ ద్వారా అదే ప్రాంతానికి చెందిన నందకుమార్‌కు డెడ్ డ్రాప్ ద్వారా డ్రగ్స్ అందిస్తుంటాడు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు చందానగర్‌కు చెందిన నవీన్‌కు అవి చేరుతున్నాయి. కొన్ని సందర్భాల్లో బెంగళూర్‌కు వెళ్లి ఇమ్రాన్ డ్రగ్స్ తెస్తుంటాడు. కస్టమర్లను బట్టి డెడ్ డ్రాప్ లేదా క్యాష్ ఆన్ డెలీవరీ విధానంలో మాదకద్రవ్యాలను అందిస్తున్నారు. ఈ రెండు ముఠాలపై సమాచారం అందుకున్న హెచ్‌న్యూ నెల రోజుల పాటు నిఘా కొనసాగించి, హుమాయూన్‌నగర్, కంచన్‌బాగ్ పోలీసులతో కలిసి ఆపరేషన్ నిర్వహించింది. ఉస్మాన్, యాకూబ్, నందకుమార్, మహ్మద్ ఇమ్రాన్, నవీన్‌ను పట్టుకున్నారు. ఇందులో యాకూబ్‌ను అతడి దేశానికి డిపోర్టు చేసేందుకు సిద్ధమవుతుండగా పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.20 లక్షల విలువైన ఎండీఎంఏ, ఎల్ఎస్డీ బోల్ట్స్‌తో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల ఫోన్లను విశ్లేషించగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని 11 మంది వినియోగదారులకు సంబంధించిన సమాచారం వచ్చింది. డ్రగ్స్ జోలికి ఎవరూ వెళ్లొదని సీపీ సూచించారు. బెంగళూర్‌లో చాలా మంది డ్రగ్ ఫెడ్లర్స్ నకిలీ గుర్తింపుతో దందా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. గోవా, ముంబై, బెంగళూర్లలో ఉన్న స్మగ్లర్లపై కూడా నిఘా పెట్టినట్లు చెప్పారు. ఇటీవల ఒడిశాలో ఓ గ్రామంలో హాష్ ఆయిల్ తయారు చేస్తున్నట్లు గుర్తించామన్నారు.

నిందితుడు మతోన్మాది

ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం ఘటనలో కుట్ర కోణం లేదని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ముంబైకి చెందిన నిందితుడు సలీం మతోన్మాదిగా మారి ఆ చర్యకు పాల్పడ్డాడని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ఎన్ ఐఏ, ముంబై ఏటీఎస్‌తో కలిసి మరింత లోతుగా దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు. నిందితుడిపై ముంబైలోనూ ఇలాంటి కేసులున్నాయన్నారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నగర సీపీ సీవీ ఆనంద్

జీఐఎస్‌కు ససేమిరా!

- అనుమానాలను నివృత్తి చేయడంలో బల్దియా విఫలం
- మూడు నెలలు గడిచినా.. 15వేల ఆస్తులు మాత్రమే గుర్తింపు
- రాబోయే 15 నెలల్లో 20 లక్షల ఆస్తుల గుర్తింపు అసాధ్యమే..
- అభిప్రాయపడుతున్న నిపుణులు
- అందరి ఆమోదం తర్వాతే సర్వే చేయాలని డిమాండ్

గ్రేటర్‌లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్) సర్వేకు ప్రజల నుంచి అడుగడుగునా వ్యతిరేకత ఎదురువుతున్నది. 'ఇంటికి సంబంధించిన వివరాలు బల్దియా వద్ద ఉన్నాయి'.. 'ప్రాపర్టీ ట్యాక్స్ కడుతున్నాం'.. మళ్లీ సమాచారం కావాలం'టూ.. రావడంపై ప్రజలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఎందుకు సర్వే చేస్తున్నారో అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, అనుమానాలను నివృత్తి చేయకపోవడంతో ప్రజలు సహకరించడం లేదు. సర్వేకు అడ్డంకులు వస్తుండటంతో నిర్ణీత గడువులోగా లక్ష్యం దాటడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసి, అందరి ఆయోదం తర్వాతే సర్వే ప్రక్రియ చేపట్టాలని నిపుణులు చెబుతున్న మాట.

-సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ)

జీహెచ్ఎంసీ పరిధిలో జీఐఎస్ సర్వే ప్రక్రియ ఈ ఏడాది జూలై 30న ప్రారంభించారు. ఈ జీఐఎస్ సర్వేకు జీహెచ్ఎంసీ దాదాపు రూ. 21 కోట్లు ఖర్చు చేస్తున్నది. గ్రేటర్ పరిధిలో ప్రతి ఆస్తిని, నిర్మాణాన్ని, ఖాళీ ప్లాట్లను, నివాసాలను, వ్యాపార భవనాలను గుర్తించి.. మ్యాపింగ్ చేసేందుకు గరిష్ఠంగా 18 నెలల గడువు తీసుకుని 20 లక్షల ఆస్తులను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గడిచిన మూడు నెలల్లో 15వేల ఆస్తులను మాత్రమే లెక్కించినట్టు అధికారులు చెబుతున్నారు. మూడు నెలల్లో కనీసం 15వేల ఆస్తుల గుర్తింపునకే పరిమితమైతే వచ్చే 15 నెలల్లో 20 లక్షల ఆస్తుల గుర్తింపు సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఈ సర్వేపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడంతో ఈ ప్రక్రియ కేవలం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్ని ప్రాంతాల్లో సర్వే చేశారు..? ఎన్ని ఆస్తులను గుర్తించారు? డ్రోన్ సర్వేలు ఎక్కడెక్కడ చేశారు? ఇంటింటి సర్వేలు ఏ ప్రాంతాల్లో పూర్తి చేశారు..? అనేది గోప్యంగా ఉంచడం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నది.



ఫిజికల్ సర్వేకు ప్రజలు దూరం

అర్బన్ ప్లానింగ్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ మెరుగుపరిచేందుకు జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ఆస్తులు, యుటిలిటీస్ మ్యాప్ చేయడానికి ఇంటిగ్రేటెడ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం సర్వేను నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జీఐఎస్‌తో బల్దియా మొత్తాన్ని డ్రోన్ ద్వారా సర్వే చేసి రికార్డు చేస్తున్నామని, దీంతో ప్రభుత్వ భూములు, చిన్న, పెద్ద రోడ్లు, చెరువులు, సరస్సులు ఇలా సిటీ మొత్తం మ్యాపింగ్ జరుగుతుందన్నారు. డ్రోన్ సర్వే పూర్తయ్యాక ప్రతి అంశం మ్యాపింగ్ ఉంటుందని, తద్వారా వీధుల్లో విద్యుత్ దీపాల దగ్గరి నుంచి చెత్త సేకరణ వరకు ప్రతి అంశం జీహెచ్ఎంసీకి సమగ్ర వివరాలు అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఆస్తిపన్ను మదింపులోనూ చాలా సులభతరం అవుతుందని పేర్కొంటున్నారు.

ఇంటింటికీ డిజిటల్ డోర్ నంబర్లు

ఇంటింటికీ ప్రత్యేకంగా డిజిటల్ డోర్ నంబర్లు ఇస్తామని, దానిపై క్యూఆర్ కోడ్ వల్ల ఆ ఇంటికి లేదా వీధిలో ఎలాంటి సేవలు అందుతాయనే విషయాలు క్షణాల్లో తెలిసిపోతాయని చెప్పారు. డోర్ టు డోర్ సర్వేలో అవసరమైన సపోర్ట్ డాక్యుమెంట్లతో పాటు ప్రాపర్టీస్, యుటిలిటీస్ , ఇన్ఫ్రాస్ట్రక్చర్స్‌కు సంబంధించిన సమాచారాన్ని మాత్రమే సేకరిస్తారని స్పష్టం చేశారు. కాగా, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలతో చాలా మంది ఆందోళన చెందుతున్నారు. సర్వేకు వచ్చిన అధికారులు, సిబ్బంది జీహెచ్ఎంసీకి సంబంధించిన వారేనా? లేదంటే ప్రైవేట్ వ్యక్తులా? అన్న కోణంలో కొందరు? సమగ్ర వివరాలు ఇస్తే ..ఆస్తిపన్ను భారం మరింత పడుతుందని మరికొందరు? జీహెచ్ఎంసీ వద్ద వివరాలు ఉన్నప్పటికీ మళ్లీ ఎందుకు అడుగుతున్నారని మరికొందరు సర్వేకు దూరంగా ఉంటున్నారు.

స్టెరిలైజేషన్‌తోనే వీధి కుక్కల బెడద నివారణ

బల్దియా కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో: గ్రేటర్‌లో వీధి కుక్కల బెడద నివారణకు స్టెరిలైజేషన్ అధిక సంఖ్యలో చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కమిషనర్ ఎల్బీనగర్ జోనల్ ఫతుల్లాగూడ జంతు సంరక్షణ కేంద్రాన్ని, డాగ్ క్యాచింగ్ వెహికల్, కుక్కల ఆపరేషన్ థియేటర్, పెంపుడు కుక్కల క్రిమిటోరియం, సీ అండ్ డీ ప్రాసెసింగ్ ప్లాంట్లను పరిశీలించారు. రోజుకు ఎన్ని కుక్కలను పట్టుకుంటున్నారు? ఎన్నింటికీ స్టెరిలైజేషన్ జరుగుతున్నాయి' అంటూ కమిషనర్ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టెరిలైజేషన్ చేసిన కుక్కల వివరాలు, జోన్‌లోని సర్కిల్ వారీగా పట్టుకున్న కుక్కల వివరాలను డాక్టర్ వకీల్ కమిషనర్‌కు వివరించారు. సర్కిల్ వారీగా వెహికల్ ఉన్న నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో వీధి కుక్కలను పట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుక్కల బెడద, కుక్కకాటు నివారణకు శస్త్ర చికిత్సలు చేసినప్పుడు మాత్రమే ఫలితాలు ఉంటాయన్నారు. పెట్‌డాగ్‌ల క్రిమిటోరియం పరిశీలించి, నెలకు ఎన్ని జరుగుతున్నాయని నిర్వాహకులను అడగ్గా, నెలకు సుమారు 30 నుంచి 35 వరకు క్రిమిటోరియం చేస్తున్నట్లు కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా 500 టన్నుల కెపాసిటీతో నాలుగు భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి కమిషనర్‌కు వివరించారు.

ఎల్బీనగర్ జోన్ ఫతుల్లగూడలోని జంతు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

రూ.600 కోట్ల సర్కారు స్థలం...

కబ్జాకు యత్నం

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): భారీ భూ కుంభకోణం కుట్రను సైబరాబాద్ పోలీసులు భగ్నం చేశారు. రూ.600 కోట్ల విలువైన 12.09 గుంట ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు యత్నించిన ఆరుగురిని సైబరాబాద్ ఆర్థిక నేర పరిశోధనా విభాగం(ఈవోడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం... బోరబండకు చెందిన మహ్మద్ అబ్దుల్ రజాక్, నవీన్‌కుమార్ గోయల్(గీక్ బిల్డర్ ఎల్ఎల్పీ భాగస్వామి), మహ్మద్ అబ్దుల్ ఆదిల్, సయ్యద్ కౌసర్, అప్షరాలు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ జె.గురు సాయిరాజ్‌తో కలిసి రాయదుర్గంలో రూ.600 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఏకంగా ప్రభుత్వ రెవెన్యూ రికార్డులనే తారుమారు చేసి, నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ పత్రాలతో ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గురుసాయిరాజ్‌తో కలిసి ఈ ప్రభుత్వ భూమిని 'డెవలప్‌మెంట్ అగ్రీమెంట్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ'(డీజీపీఏ) చేయించుకున్నారు. ఇందులో భాగంగా కబ్జా చేసిన స్థలంలో 39 అంతస్తుల్లో 19 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 30:70 నిష్పత్తిలో కమర్షియల్ కమ్ రెసిడెన్షియల్ మెగా కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు భారీ ఎత్తున కుట్రపన్నారు. సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి తహసీల్దార్ కుకల వెంకరెడ్డి దీనిపై సమగ్ర విచారణ జరిపించగా, కబ్జాదారుల చెరలో ఉన్నది రూ.600 కోట్ల విలువైన 12.09 గుంటల ప్రభుత్వ భూమి అని తేలింది. సీపీ ఆదేశాల మేరకు ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ పర్యవేక్షణలో ఏసీపీ రవీందర్ కేసు నమోదు చేసి, కబ్జాకు యత్నించిన ఆరుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నాణ్యతలేని స్వీట్లు

గడువు ముగిసిన పదార్థాలతో తయారీ

ఆగ్రా స్వీట్స్‌కు లైసెన్స్ లేదు

నిబంధనలు ఉల్లంఘించిన వినూత్న, వాసిరెడ్డి ఫుడ్స్

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెల్లడి

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : దీపావళి అంటే స్వీట్లకు ఎక్కడ లేని డిమాండ్.. మంచి తరుణం మించిన దొరకదని భావించే మిఠాయి దుకాణాదారులు దీపావళి డిమాండ్‌ను ఆసరా చేసుకొని స్వీట్ల తయారీలో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలతో స్వీట్లు తయారీ చేసి వినియోగదారులకు అంటగడుతున్నారు. ఈ నేపథ్యంలోనే నిబంధనలు అతిక్రమించిన పలు స్వీట్స్ యజమానులపై ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. అమీర్‌పేటలో పలు షాపులపై దాడులు నిర్వహించగా, ఎక్కువ శాతం ఫుడ్ లైసెన్స్‌లు లేకుండా, గడువు ముగిసిన పదార్థాలతో స్వీట్లు తయారు చేస్తున్నట్లు, వంటగదిలో అపరిశుభ్రత ఉందని తేల్చారు. అమీర్‌పేటలోని ఢిల్లీ మిఠాయివాలాలో తనిఖీలు చేపట్టగా.. పెరుగు, పాలు వంటి కొన్ని ఆహార పదార్థాలు లేబుళ్లు వేయలేదని, అపరిశుభ్రమైన వాతావరణంలో చక్కెర సంచులు నిల్వ చేసినట్లు , స్టోర్ రూంలో ఎలుకలు తిరుగుతున్నట్లు గుర్తించారు. వంటగదిలో డస్ట్‌బిన్లకు మూతలు లేవు. అమీర్‌పేటలోని ఆగ్రా స్వీట్స్ నిర్వాహకులు లైసెన్స్ లేకుండా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పనిచేసే సిబ్బందికి హెడ్ క్యాపులు, గ్లౌవ్స్ లేవని, ఫ్రిజ్‌లో ఆహార ప్యాకెట్లకు లేబుళ్లు లేవని, మరికొన్ని గడువు ముగిసినట్లు గుర్తించారు. వినూత్న ఫుడ్స్, వాసిరెడ్డి హోంఫుడ్స్‌లోనూ నిబంధనల ఉల్లంఘన జరిగింది. రాష్ట్ర లైసెన్స్ బదులు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. సాపరీస్ వంటి ఆహార పదార్థాలకు లేబుల్స్ లేవని, సిబ్బంది ఎలాంటి సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని తేల్చారు.

ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

మూసీ పునరుజ్జీవం వద్దు.. మా ఇండ్లే మాకు ముద్దు

చైతన్యపురి, కొత్తపేట డివిజన్ల పరిధిలోని మూసీ కాలనీల హౌస్ ఓనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. 'మూసీ పునరుజ్జీవం వద్దు.. మా ఇండ్లే మాకు ముద్దు.. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్, ఇదేం రాజ్యం, ఇదేం రాజ్యం.. దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం' అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మూసీ పరీవాహకంలో నివాసాలను కూల్చడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. -ఎల్బీనగర్